క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగపాక: మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని మన్మథరావు కోరారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



బ్రాండిక్స్ అపెరల్ సిటీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీ నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించిన 130వ కంటి వైద్య శిబిరానికి 600 మంది విచ్చేయగా వారిలో 400 మందికి పరీక్షలు నిర్వహించి, 245 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.100 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయాలు కల్పించారు.

సుందరరావుకు పీవీ నర్సింహారావు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుందరరావు దంపతులు

పాయకరావుపేట: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ దోమాడ సుందరావుకు విశాఖపట్నంకు చెందిన శ్రీ ఫౌండేషన్ 2024 సంవత్సరానికి గాను పీవీ నర్సింహారావు జాతీయ అవార్డును అందించారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు సుందరరావును విశాఖపట్నంలో ఆదివారం సత్కరించి అవార్డును అందించారు.

వీధి రోడ్లు మురుగుమయం



బంగారమ్మపాలెంలో వీధిరోడ్డుపై నిలిచిన నీరు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో పారిశుధ్య లోపం రాజ్యమేలుతోంది. ఈ గ్రామంలో వీధిరోడ్డుపై కురిసిన వర్షపు నీటితో పాటు, ఇళ్లలో వాడుక నీరు మురుగునీరు నేరుగా రోడ్డుపైకి చేరడంతో రోజుల తరబడి రోడ్డుపై నీరు నిల్వ ఉండి దుర్వాసన నెలకొంది. రోడ్డుకు ఆనుకుని ఉన్న నివాసితులు డ్రైనేజీ కాలువ కప్పివేసి నిర్మాణాలు చేపట్టడంతో ఈ సమస్య ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఒకరిని చూసి మరొకరు నిర్మాణాలు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగునీటి సమస్య జటిలమవుతోంది. దోమలు సమస్య పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారులు గ్రామంలో పరిస్థితిని చక్కదిద్ది పారిశుధ్య సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధి కోర్సులతో ఆసరా

కశింకోట : మహిళలు ఆర్థికంగా బలపడటానికి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు దోహదపడతాయని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో మహిళలు ఏ కార్యక్రమం చేపట్టినా విజయం తథ్యమన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తో వారి కుటుంబాలకు ఆసరా దొరుకుతుందన్నారు.

గోతులమయం... దినదిన గండం



రాంబిల్లి ప్రధాన రహదారిలో బండరాళ్ల లోడుతో వెళుతున్న లారీలు

- రాళ్లు, కంకర తేలిన రాంబిల్లి నేవల్‌బేస్ ప్రధాన రహదారి
- వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి వరకు ఛిద్రమైన రోడ్డు
- వాహనచోదకులు, ప్రయాణికులకు తప్పని కష్టాలు
- ప్రమాదాలకు నిలయాలుగా గోతులు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాద బాధితులు



అధ్వానంగా రాంబిల్లి ప్రధాన రహదారి



రాంబిల్లికి వెళ్లే రహదారిలో గోతులు

రాంబిల్లి(యలమంచిలి): అడుగుకో గొయ్యి... గజానికో గుంత.. రాళ్లు తేలిన కంకరగా రాంబిల్లి నేవల్ బేస్‌కు వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు రూపు మారిపోయింది. పగటిపూట ప్రయాణం నరకం.. రాత్రి వేళ ప్రయాణం ప్రాణాంతకమే. వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి నేవల్ బేస్‌కి వెళ్లే రహదారి రూపు కోల్పోయింది. అధికారంలోకి రాకముందు కూటమి నేతలు రహదారులు అధ్వానంగా ఉన్నాయని ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందారు. కానీ అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు సంగతే మరిచిపోయారు. రాంబిల్లి మండలంలో రూపుదిద్దుకుంటున్న నేవల్‌బేస్ నిర్మాణంలో ఉపయోగించే బండరాళ్లను తరలిస్తున్న టిప్పర్ లారీలు అధిక మొత్తంలో బరువు కలిగిన బండరాయిలను రవాణా చేయడంతో రాంబిల్లి ప్రధాన రహదారి ఛిద్రమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిమితికి మించి బరువున్న బండరాళ్లను టిప్పర్ లారీలతో రాత్రి పగలు లేకుండా ఏకధాటిగా అతివేగంగా నిత్యం జన సంచారంతో ఉండే గ్రామాల మీదుగా దూసుకుపోతుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అన్న భయంతో స్థానిక ప్రజలు ఉన్నారు. ఈ రోడ్డుపై గోతుల వల్ల గతంలో ఈ రహదారిపై ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు ఇంకా ఛిద్రమైపోయింది. ఆ గుంతల రోడ్లలో ప్రయాణించడం వల్ల తమ ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. గతంలో స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మండల పరిషత్, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో రాంబిల్లి ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని పదే పదే సంబంధిత శాఖాధికారులను కోరినా వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. రాంబిల్లి నేవల్ బేస్‌కు తుని, కోటనందూరు, రౌతులపూడి తదితర ప్రాంతాల నుంచి బండరాళ్లను నేవల్‌బేస్‌కు పరిమితిని మించిన లోడుతో తరలించడం వల్ల రాంబిల్లి ప్రధాన రహదారి దెబ్బతిన్నదని, వాటిపై నియంత్రణ విధించాలని, రహదారికి మరమ్మతులు జరిపి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం



రాంబిల్లి మండల కేంద్రానికి వివిధ పనులపై వెళ్లాలంటే నరకప్రాయమే. తరచూ రాంబిల్లి ప్రధాన రహదారిపై ప్రయాణాలు సాగిస్తుంటాం. గుంతల రోడ్డులో వాహనాలు అదుపు తప్పి పడిపోవడం జరుగుతుంది. రాంబిల్లి వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందనే భయంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం రాంబిల్లి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలను తీర్చాలి.

– ధూళి వెంకి, హరిపురం

గోతుల రోడ్డుతో కష్టాలు



రాంబిల్లి మండలంలో తరచూ కూలి పనుల నిమిత్తం వెళ్తున్నాను. నా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి గోతిలో పడతామనే భయంతో బిక్కుబిక్కుమంటూ బండి నడపవలసి వస్తుంది. ప్రభుత్వం రాంబిల్లి ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలి.

– మిడతాన శ్రీను, ధారభోగాపురం

ప్రమాదాలు నివారించాలి



రాంబిల్లి ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం గండంగా మారింది. పదే పదే గేర్లు మార్చడం వల్ల ఇంధన ఖర్చుతో బాటు కాలుష్యం కూడా పెరిగిపోతుంది. అలాగే రోడ్డుపై బండరాళ్లు తీసుకువెళ్లే లారీలు ఓవర్‌లోడ్‌తో అతివేగంగా వెళ్లడం వల్ల రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. బండరాళ్ల లారీలు పరిమితికి మించిన బరువుతో ప్రయాణించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– ధూళి సూర్యచంద్ర, హరిపురం

త్వరలోనే రోడ్డు మరమ్మతులు



వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మండల కేంద్రం నేవల్‌బేస్‌కు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులకు గురవడం వాస్తవమే. ప్రభుత్వానికి, నేవల్ బేస్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఈ రోడ్డు సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే నేవల్‌బేస్ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

– విద్యాసాగర్, ఆర్అండ్‌బీ డివిజనల్ ఇంజినీర్, యలమంచిలి

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



రూ.50,116 విరాళం అందజేస్తున్న రమేష్ దంపతులు

మునగపాక : మూలపేట గంగాలమ్మతల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. తోటాడకు చెందిన దొడ్డి రమేష్, భవానీ దంపతులు, కుమారులు హర్షవర్ధన్, ఆనంద్‌వర్ధన్ ఆదివారం రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవలో భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం రాత్రి ఉయ్యాల సేవ ఘనంగా జరిగింది. వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి పల్లకి కమిటీ ఆధ్వర్యంలో ఉయ్యాల సేవ 7వ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలా టం, సంగీత లహరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాస నామస్మరణతో నాగులాపల్లి మార్మోగింది.

15న భక్త చింతామణి పద్య నాటకం ప్రదర్శన

మునగపాక : తిమ్మరాజుపేటలో ఈ నెల 15న భక్త చింతామని పద్య నాటక ప్రదర్శన జరుగుతుందని సర్పంచ్ బీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దుర్గాలమ్మ తల్లి పండగ సందర్భంగా కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, బీవీఏ నాయుడు సారథ్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. రాత్రి 9 గంటలకు రామాలయం గుడి ఆవరణలో ఏర్పాటు చేసే నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని వారు కోరారు.

అర్హులైన దివ్యాంగులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగులు

ఎస్.రాయవరం : ప్రభుత్వాలు అర్హులైన దివ్యాంగులకు మేలు చేసే కార్యక్రమాలు చేయాలని దివ్యాంగుల సంఘ సభ్యులు కోరారు. పాయకరావుపేట నియోజకవర్గ దివ్యాంగుల సమావేశం తిమ్మాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాయి తాతియ్యలు మాట్లాడుతూ దివ్యాంగులకు అందాల్సిన రాయితీ రుణాలు, ట్రై సైకిళ్లు, స్కూటర్స్ అర్హులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చాలా మంది దివ్యాంగులుగా నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లు, సదుపాయాలు పొందుతున్నారన్నారు. దానివల్ల అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోటఉరట్ల మండలం యండపల్లికి చెందిన గుడివాడ వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన సరసా నాగరాజు, కార్యదర్శిగా కొర్ని సింహాచలం, జాయింట్ సెక్రటరీగా యర్రా శ్రీనివాసరావు, కోశాధికారిగా జి.కాశీరావు తదితరులు ఎన్నికయ్యారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



గవర్ల అనకాపల్లిలో ఫాగింగ్

మునగపాక: తోటాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో దోమల బెడద లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో శనివారం రాత్రి దోమలమందు పిచికారీ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దోమల నివారణకు సంబంధించి ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా గ్రామాల్లో దోమలు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



జాతీయ జెండాలు అందజేస్తున్న ధనశ్రీను

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మా ఊళ్లో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను కోరారు. మండలంలోని మంగళవరపుపేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం దేశభక్తి గీతాలు, స్వాతంత్ర్య దినోత్సవ గీతాలకు సంబంధించి శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు జెండాలు అందజేశారు. ధనశ్రీను మాట్లాడుతూ సెలవు రోజుల్లో పిల్లలు టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి వారం పిల్లలకు పుస్తకపఠనం అలాగే విలువలతో కూడిన విద్య, దేశభక్తిపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ప్రసాదరావు, గ్రంథాలయం డైరెక్టర్లు సునీత, కనక, తులసి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



క్లబ్ సభ్యులతో అల్లూరి ఉషారాణి, తిరుపతిరాజు తదితరులు

అనకాపల్లి : ఎలియన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షునిగా కడిమిశెట్టి పీవీ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ గ్రంధి కన్నయ్య పంతులు హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా కె.వి.సత్యనారాయణ, కోశాధికారిగా వీఎన్‌కే హరనాథ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, పీఎస్వీ రవికుమార్, సహాయ కార్యదర్శిగా పి.శంకర్‌తో పాటు 13 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా వైస్ గవర్నర్ అల్లూరి ఉషారాణి వ్యవహరించారు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ బి.తిరుపతిరాజు మాట్లాడుతూ అనకాపల్లిలో మొదటి సారిగా క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. పట్టణం, మండలంలో క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.విశ్వేశ్వరరావు, ఎస్.మహేశ్వరరావు, కె.రాజేశ్వరరావు, కడిమిశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి పరామర్శ



జెడ్పీటీసీ లంక సూర్యనారాయణను పరామర్శించిన నాయకులు

పాయకరావుపేట : ఇటీవల అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ లంక సూర్యనారాయణను వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు తదితరులు జెడ్పీటీసీని ఆయన స్వగృహంలో కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యానికి గురై ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న సూర్యనారాయణను పరామర్శించిన వారిలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ ఉన్నారు.

మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ

అనకాపల్లి : మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామనే స్ఫూర్తితో ప్రజలందరూ సహకరించాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 8 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

'వర్గీకరణతో ఉపకులాలకు నష్టం'

తుమ్మపాల : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగితే అనేక ఉపకులాలు నష్టపోతాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బోన గణేష్ అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ విషయాన్ని ఎన్నికల ముందు తెరమీదకి తీసుకొచ్చారన్నారు. వర్గీకరణ గనుక జరిగితే జిల్లాల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాలలంతా కలిసి భవిష్యత్తు తరాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సియాద్రి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనిటరీ మెంబర్ గంగాధర్ మరియమ్మ, అప్పలరాజు, రాజన బుజ్జిబాబు, తట్టా రాజు, మరువడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం పాల్గొన్నారు

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి



రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరన్స్ చేయాలని కోరుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను అధికారులు తొలగించాలని జిల్లా డీవైఎఫ్ఐ నాయకులు చింతకాయల శివాజీ కోరారు. ఆదివారం మండలంలో రాంబిల్లి నుంచి కొత్తపట్నం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పారం కంచె తుప్పలను డీవైఎఫ్ఐ నాయకులు ఆధ్వర్యంలో తొలగించారు. రహదారికి అడ్డుగా ఏపుగా పెరిగిన పిచ్చి తుప్పలను వారు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి పోవడం వల్ల రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రోడ్లపైకి చెట్ల కొమ్మలు అడ్డు రావడం వల్ల భారీ వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాంబిల్లి ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు, శ్రీను, అప్పలరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం అందజేత



కిరణ్ కుటుంబానికి నగదు సాయం అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి : గత ఏడాది జాతీయ రహదారిపై సారిపల్లిపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులై మంచానికే పరిమితమైన నక్కపల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పెదపూడి కిరణ్‌కుమార్ కుటుంబానికి విశాఖపట్నానికి చెందిన స్పందన చేయూత ఫౌండేషన్, మరికొంత మంది మిత్రులు కలిసి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆలపాటి సుబ్బారావు చేతుల మీదుగా కిరణ్‌కుమార్ కుటుంబానికి రూ.36,500 నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌తో పాటు ఆయన భార్య, కుమార్తె కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆలపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నక్కపల్లి మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంవత్సరానికి 50 మందికి స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నామన్నారు. మహిళలకు టైలరింగ్ నేర్పించి మిషన్‌లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, భీశెట్టి శివాజీ, రాజేశ్వరరావు, అమర లింగేశ్వరరావు, యచేంద్ర, డి.రాంబాబు పాల్గొన్నారు.

స్వీట్‌కార్న్ సాగుపై రైతుల ఆసక్తి


మండలంలో 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంట



బొట్టవానిపాలెంలో సాగులో ఉన్న స్వీట్‌కార్న్ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్టప్రాంత గ్రామాల రైతులు ఖరీఫ్‌లో భాగంగా స్వీట్‌కార్న్(మొక్కజొన్న) పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మూడు నెలల వ్యవధిలో పంట కోత దశకు రానుండటం, మార్కెట్లో కాస్త డిమాండ్ ఉండటంతో పలువురు రైతులు సంప్రదాయ పంటల స్థానంలో స్వీట్‌కార్న్‌వైపు దృష్టి సారిస్తున్నారు. మండలంలోని బొట్టవానిపాలెం, కె.సంతపాలెం, అర్లి, గొల్లలపాలెం, పాతవలస, సూదివలస గ్రామాల రైతులు 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంటను సాగు చేస్తున్నారు. పంట సాగు సమయంలో చేపట్టే దుక్కులు, విత్తనాలు, సస్యరక్షణ మందులు, నీటితడులకు ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి సరిపోతుందని, ఖర్చులు పోనూ ఎకరానికి కనీసం రూ.30 వేలు వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట కోతదశకు చేరుకుంది. పంటను స్థానికంగా విక్రయించడంతోపాటు విశాఖపట్నం, గాజువాక, విజయనగరం ప్రాంతాల్లోని మార్కెట్లకు తీసుకెళ్లి రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. పెట్టుబడి వ్యయం, శ్రమ తక్కువ కావడంతోపాటు, మార్కెట్లో డిమాండ్ ఉండి, ఆదాయం కూడా బాగుండటంతో స్వీట్ కార్న్ సాగు చేస్తున్నట్లు రైతులు చెప్తున్నారు.

భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు



నూకాంబిక ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

తుమ్మపాల : బడిఈడు పిల్లలు భిక్షాటన చేయడం రోడ్లపై నిత్యం చూస్తూనే ఉంటాం. అలా వచ్చిన నగదుతో కుటుంబానికి సహాయంగా ఉంటారనుకుని అందరం తోచిన చిల్లరి ఇస్తూ పిల్లలను శాశ్వతంగా బిచ్చగాళ్లను చేసేస్తున్నాం. దీంతో పిల్లల భిక్షాటన ఇప్పుడు నేరుగా దేవాలయాల్లోనే సాగుతోంది. ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో బడిఈడు పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పట్టణం, కశింకోట ప్రాంతాల నుంచి 20 మందికి పైగా బడిఈడు పిల్లలు వివిధ వేషధారణలు, పేర్లు మార్చుకుంటు, అంగవైకల్యం ప్రదర్శిస్తు భిక్షాటన చేస్తు రోజంతా గడిపేస్తున్నారు. అమ్మవారి దర్శనం నిమిత్తం వచ్చిన భక్తుల నుంచి చిల్లరతో పాటు ప్రసాదాలు, భోజనం దొరకడంతో రాత్రి 8 వరకు ఉంటున్నప్పటికీ పట్టించుకునేవారే లేకుండా పోయారు. దేవాలయంలో ఈవో కార్యాలయం వద్ద నేలపై వరుసగా కూర్చుని భిక్షాటన చేస్తున్న పిల్లలు అధికారులకు కనిపించడం లేదు. కనీసం ల్యాబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ అధికారులైనా దృష్టి సారించి వారి వివరాలు తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలని భక్తులు కోరుతున్నారు.